
ప్రజాశక్తి
బుధవారం 22 మే 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





కొనసాగుతున్న సర్వీసు ఓట్ల పోలింగ్

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నమోదైన సర్వీస్ ఓట్ల పోలింగ్ కొన సాగుతూనే ఉంది. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికల అధికారులకు సీల్డ్ కవర్లో ఈ ఓట్లు అందుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం రెండు ఓట్లు పోల్ కాగా వాటిని రాజకీయ పార్టీల ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో కందుకూరు స్ట్రాంగ్ రూములో చేర్చి భద్రపరిచారు. ఈ రెండు ఓట్లతో కలుపుకొని ఇప్పటికే 25 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్,వైసిపి చీఫ్ ఎలక్షన్ ఏజెంటు ముప్పవరపు కిషోర్, టిడిపి చీఫ్ ఎలక్షన్ ఏజెంటు సిహెచ్ హరికృష్ణ ఉన్నారు.



కంటైనర్ టెర్మినల్ కథ కంచికేనా..!

- ఫిబ్రవరిలో వచ్చిన వెజెల్‌తో సరి
- సోమిరెడ్డి విమర్శలే నిజమా?
- పోర్టు అధికారుల కాకి లెక్కలు

కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ టెర్మినల్ కథ కంచికే చేరినట్లు తెలుస్తోంది. ప్రజా పోరాటంతో సాధించుకున్న కృష్ణపట్నం పోర్టు ఉనికి కోల్పోతోంది. ఎగుమతులు, దిగుమతులకు అనుకూలంగా భారీ వ్యయంతో ఏర్పాటు చేసిన కంటైనర్ టెర్మినల్ అంతంత మాత్రంగానే ఉన్నట్లు సమాచారం. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జనవరిలో కంటైనర్ టెర్మినల్ చెన్నయ్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆరోజు పోర్టు అధికారులు అందులో వాస్తవం లేదని ఖండించారు. ఫిబ్రవరిలో 4200 కంటైనర్లతో ఒక వెజల్ తీసుకొచ్చారు. అప్పటి నుంచి మరో వెజల్ వచ్చినట్లు సమాచారం లేదు. ప్రతిపక్షాలు ఒక్కటై ఆందోళన నిర్వహించినా ప్రభుత్వం తోసిపుచ్చింది. ఇప్పుడు పరిస్థితులు చూస్తుంటే కంటైనర్ టెర్మినల్ కథ ముగిసినట్లేనని సమాచారం.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

దేశంలోనే కృష్ణపట్నం పోర్టుకు ప్రత్యేకత ఉంది. సిపిఎం, టిడిపి. కాంగ్రెస్ పోరాటం ఫలితం దీనిని సాధించుకుంది. 1996లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు పునాదివేశారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేగంగా నిర్మాణం చేసి, యుపిఎ ఛైర్మన్ సోనియా గాంధీ జాతికి అంకితం చేశారు. కెపిఎల్ ఆధ్వర్యంలో వేగంగా అభివృద్ధి చెందింది. ఆ కంపెనీ ప్రతిష్టాత్మకమైనది. కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ టెర్మినల్ ఏర్పాటు చేసింది. దేశంలో 12 ప్రధాన పోర్టులుంటే, వాటిలో టాప్ లో ఉన్న చెన్నై, విశాఖ, ముంబై పోర్టులతో కృష్ణపట్నం టెర్మినల్ ఒకప్పుడు పోటీ పడింది. ఇటీవల ఈ పోర్టును అదానీకి కట్టబెట్టారు. అప్పటి నుంచి అనేక పరిణామాలు చోటుచేసు కుంటున్నాయి. ఈ టెర్మినల్ జనవరి నెలాఖరుతో మూతప డుతుందని టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. సిపిఎం, కాంగ్రెస్, జనసేన పార్టీలను కలుపుకొని ఉద్యమం ప్రారంభించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పోర్టు యాజమాన్యం అందులో వాస్తవం లేదని, కంటైనర్ టెర్మినల్ ఎక్కడికి పోదని తెలిపారు. మంత్రి



కాకాణి ఒత్తిడితో 4200 కంటైనర్లతో ఒక వెజల్ పోర్టుకు వచ్చింది. ఇదే కొనసాగుతుందని మంత్రి ప్రకటించారు. ఆ రోజు వచ్చింది ఖాళీ కంటైనర్లు అని ప్రతిపక్షపార్టీలు ఆరోపించాయి. దీనిపై పోర్టు యాజమాన్యం ఏమీ చెప్పలేదు. కృష్ణపట్నం పోర్టు కంపెనీ నుంచి అదానీ చేతుల్లోకి పోర్టు వచ్చిన తర్వాత పరిస్థితులు మారుతున్నాయి. కృష్ణపట్నం పోర్టు నుంచి కొలంబో, అమెరికా, షాంగై, సింగపూర్‌లకు ఎగుమతులు జరుగుతుండగా, చైనా, మలేషియా, దుబాయ్, థాయ్ లాండ్ నుంచి దిగుమతులు జరుగుతున్నాయి. ప్రధానంగా బియ్యం, పొగాకు, గుంటూరు మిర్చి, పత్తి, క్వార్ట్జ్, రొయ్యల తదితర ఉత్పత్తుల ఎగుమతి జరుగుతున్నాయి. . శ్రీసిటీలోని మోటారు పరిశ్రమలకు సంబంధించిన పరికరాలతో పాటు పేపర్ రోల్స్, వైట్ సిమెంట్, సోలార్ ప్యానెల్స్, ఫర్నీచర్, ఎల్ఈడీ లైట్లు, ఫర్నీచర్, ముడి పామాయిల్, కెమికల్స్ దిగుమతి అవుతుంటాయి. 2014-19 మధ్యకాలంలో ఏడాదికి 6 లక్షల కంటైనర్లు ఎగుమతులు, దిగుమతులు జరగ్గా, టర్నోవర్ రూ.9 లక్షల కోట్లు జరిగేది. . స్టేట్ ట్యాక్స్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి రూ.1000 కోట్లు వరకు ఆదాయం లభించేదని లెక్కలు చెబుతున్నాయి. .అదాని వచ్చాక, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2019-21 మధ్య కాలంలో కంటైనర్ల ఎగుమతులు, దిగుమతులు 4 లక్షల కంటైనర్లకు పడిపోయాని సమాచారం. . టర్నోవర్ రూ.5 లక్షల కోట్లకు తగ్గిందని తెలుస్తోంది. స్టేట్ ట్యాక్స్ రూపంలో రాష్ట్రానికి రావాల్సిన పన్నులు ఏడాదికి రూ.500 కోట్లకు పడిపోయని విమర్శలు వచ్చాయి. 2021-23 ఏడాదికి కేవలం లక్ష కంటైనర్లు మాత్రమే ఎగుమతులు, దిగుమతులు జరగ్గా, టర్నోవర్ రూ.1.50 లక్షల కోట్లకు తగ్గిపోయిందని, రాష్ట్రానికి రావాల్సిన పన్నులు రూ.150 కోట్లకు పరిమితమయ్యాయని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. . కృష్ణపట్నం పోర్టు ద్వారా జరగాల్సిన ఎగుమతులు, దిగుమతులను తమిళనాడులోని అదానికి చెందిన కాటుపల్లి, ఎన్నూరు పోర్టులకు మార్చేశారని, . ఫలితంగా కృష్ణపట్నంలో పరోక్షం, ప్రత్యేక్షంగా 10 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని, ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. కంటైనర్ టెర్మినల్ తరలిపోతుండటంతో కస్టమ్స్ హౌస్ ఏజెంట్, కంటైనర్ ఫైర్ స్టేషన్, లైనర్ ఏజెంట్స్, యార్డ్స్, ట్రాన్స్ పోర్టర్స్, లేబర్ కాంట్రాక్టర్స్, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, డ్రైవర్స్, ఆపరేటర్స్, డైలీ వేజ్ లేబర్ తదితర విభాగాల్లో 10 వేల మంది ఉపాధి కోల్పోతున్నారనే విమర్శలు వచ్చాయి. ప్రొవిజన్స్, కూరగాయలు, వస్త్రాలు, హోటళ్లు, అపార్టుమెంట్లు, బాడుగ ఇళ్లు తదితర వ్యాపారాలతో ఉపాధి పొందుతున్న స్థానికులు తీవ్రంగా నష్టపోబోతున్నారు.

కంటైనర్ టెర్మినల్ కథ ముగిసిందా..?

కంటైనర్ టెర్మినల్ తరలిపోతుందని ప్రతిపక్షపార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. జనవరి నెలాఖరుకు ఇది జరుగుతుందని చెప్పారు. ఫిబ్రవరిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. పోర్టు యజమాన్యం అందులో వాస్తవం లేదని ప్రకటించింది. ఫిబ్రవరి 15న 4200 కంటైనర్‌లతో ఒక వెజల్ పోర్టుకు వచ్చింది. ఇంకా ఇలాగే వస్తుంటాయని ప్రతిపక్షాల మాటలు వినవద్దని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మరో వెజల్ రాలేదని సమాచారం.. ఇక్కడ పనిచేసే కార్మికులు, ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు, ఇంటికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఎన్నికలు సీజన్ కావడంతో ఎవరూ దీని గురించి పట్టించుకోకపోవడంతో అంతా మౌనంగా ఉన్నారు. ఆసియాలోనే అతిపెద్ద పోర్టు భవిష్యత్తు ఎలా ఉంటుందోదనని ఆందోళన కార్మికుల్లోనూ, జిల్లా ప్రజల్లోనూ కనిపిస్తోంది.

పగడ్బంధీగా పరీక్షల నిర్వహణ..

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్, టెన్త్ సప్లమెంటరీ పబ్లిక్ పరీక్షలు పగడ్బంధీగా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు అందుకు సంబంధించి నెల్లూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. లవన్న అధ్యక్షతన కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ విసి హాల్లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇంటర్మీడియట్ బోర్డు నెల్లూరు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఏ .శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, జిల్లా వత్తి విద్యాశాఖ అధికారి కె.మధుబాబులతో బాటు పోలీస్, వైద్య ,విద్యుత్, రవాణా, పోస్టల్, మున్సిపల్ శాఖ, ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు. అన్ని శాఖలు తమ సహకారాన్ని అందించి, టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు. మొదటి సంవత్సరంలో 20,298, రెండవ సంవత్సరంలో 5,592 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. 51 పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని,14 కేంద్రాలకు ఒకేషనల్ ప్రశ్నాపత్రాలను కూడా పంపడం జరిగిందన్నారు. శిక్షణ తరగతులు చీఫ్ సూపరింటెండెంట్లకు, కస్టోడియన్లకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేస్తున్నామని ఆర్ఐఒ శ్రీనివాసులు తెలిపారు .అన్ని పరీక్షా కేంద్రాలలో ఫర్నిచర్, తాగునీరు, టాయిలెట్లు, ఫ్యాన్లు, లైట్ల వంటి కనీస సౌకర్యాలతో బాటు సిసి కెమెరాల ద్వారా పరీక్షా విధానాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు.ఈ సమావేశాల్లో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దీన దయాళ్, పి.వేణుగోపాల్, కె .కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న అధికారులు

నెల్లూరులో 'కార్డన్ సెర్చ్'

ప్రజాశక్తి-నెల్లూరు : శాంతి భద్రతలను పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అణచివేత, దొంగతనాల నివారణ, అసాంఘీక శక్తుల ఏరివేతే లక్ష్యంగా ఎస్పి కె.ఆరీఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం 'కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సామాన్యులలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచటానికి ఈ కార్డన్ సెర్చ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ ఆపరేషన్ లక్ష్యం పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, చోరీ సొత్తు, అనుమానంగా ఉన్న రికార్డులు లేని అన్నీ వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వాటివి గుర్తించి స్వాధీన పరుచుకున్నామన్నారు.



సేంద్రియ సాగుతో లాభాలు..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : సేంద్రియ ఎరువులతో సాగు రైతులకు బహుళ ప్రయోజనాలను చేకూర్చుతుందని ఎంపిఏ వి.వి.శిరీష రాణి తెలిపారు. మంగళవారం మండలంలోని నరుకూరు రైతు భరోసా కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యం పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఏఓ మాట్లాడుతూ వాతా వరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు వరిలో దిగు బడులపై ప్రభావం చూపుతు న్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతులను వినియోగించాలని సూచించారు. రసాయన ఎరువులను మాత్రమే వాడకుండా సేంద్రియ పదార్థాలను ఉపయోగించాలని సూచించారు. దాంతో ఆరోగ్యవంతమైన భూమి రైతు సొంతం అవుతుందన్నారు. వరి పంటలో అధిక, సుస్థిర దిగుబడులు సాధించాలంటే పోషక పదార్థాలు సమతుల్యంగా తగిన మోతాదులో అందాలంటే సమగ్ర పోషక యాజమాన్యం చేపట్టాలని తెలిపారు. అవగాహన సదస్సులో గ్రామ వ్యవసాయ సహాయకులు పి.శివ కుమార్, ఎస్.నిరీషా రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

మనోజకు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మాగంటి మనోజ వర్ధంతి సభ టి వెంకట్రావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె మున్వర్ సుల్తానా మాగంటి మనోజ చిత్రప టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్వర్ సుల్తానా మాట్లా డుతూ మాగంటి మనోజ సిపిఎం, సిఐటియు, అంగన్‌వాడీ యూని యన్‌లో జిల్లా బాధ్యతలు సమర్ధ వంతంగా నిర్వహించారన్నారు. . మనోజ మరణం కందుకూరులో ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. ఐద్వా నాయకులు ఎం పద్మ మాట్లా డుతూ కందుకూరు పట్టణంలో మనోజ మహిళా సంఘంలో అనేక కార్యక్రమాలు చేశారని నిరంతరం పనిచేశారని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్, డి ఎం రాయుడు, ఎం ప్రసాద్ ,ఎస్ పవన్ కుమార్, అంగన్వాడి నాయకులు అనురాధ ,మస్తానమ్మ ఉన్నారు.



మనోజ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

భోజన ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి - కందుకూరు : "ఆకలికి అందరూ బంధువులే" అనే నినాదంతో ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ కందుకూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం ఒక దాత సహాయంతో పేదవారికోసం కందుకూరు ఊరి బయట వద్ధులను, పిల్లలను గుర్తించి వారికి భోజనాల ప్యాకెట్లు అంద జేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ పేర్కొ న్నారు. ప్రెసిడెంట్ సాజిద్, ట్రెజరర్ హాఫీజ్, ఇన్‌ఛార్జి అయూబ్ ఖాన్ పఠాన్, షంషుద్దీన్ పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు : టౌన్ డివిజన్ లోని 12 సెక్షన్ల పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లను క్రమం తప్పకుండా తనిఖీలు చేయడం వల్ల వినియోగదారులకు అంతరాయ రహిత విద్యుత్ సరఫరా చేయడం సాధ్యమౌతుందని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా సూప రింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ ఆ శాఖ అధికారులకు పిలుపు నిచ్చారు. మంగళవారం టౌన్ డివిజన్ అధికారులతో ఆయన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ అంతరాయలు ఏవైనా జరిగితే ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్‌కు ఫోన్ చేయాలన్నారు. 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు కానీ , 9133331912 వాట్సప్ నెంబర్ కు కానీ ,చేయొచ్చన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ ఏ. సోమశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ మన్నెపల్లి శ్రీధర్, మధు సూధన్ రెడ్డి, కిరణ్ కుమార్ అసిస్టెంట్ ఇంజనీర్స్ లక్ష్మీ బాయ్, చిన్నయ్య, లక్ష్మీ నారాయణ, విజయ్,కష్ణవేణి, సుకుమార్,గోపి అసిస్టెంట్ ఇంజనీర్ కమర్షియల్ సెక్షన్ ప్రణీత, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీలత, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీధర్ రాజు జూనియర్ ఇంజినీర్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఇ

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ కోడ్ అమలు

కౌంటింగ్‌పై సమీక్షలో కలెక్టర్ ఎం. హరినారాయణన్

ప్రజాశక్తి-నెల్లూరు : ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార యాంత్రాంగానికి ఎన్నికల అధికారి ఎం.హరినారాయణన్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆయన స్థానిక తిక్కన ప్రాంగణంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల నోడల్ ఆఫీసర్లతో ఎన్నికల ప్రవర్తన నియమావళి, కౌంటింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోఎన్నికల తర్వాత రాజకీయ ఘర్షణలు, అల్లర్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు రాబోయే 13 రోజులు అప్రమత్తంగా ఉండి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల తర్వాత క్షేత్రస్థాయిలో ఘర్షణలు జరగకుండా ప్రశాంత వాతావరణం కల్పిం చాలన్నారు. జిల్లాలో ఎన్నికలు పూర్తయి నప్పటికీ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని రిటర్నింగ్ అధికారులు విధిగా తప్పకుండా అమలు చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎత్తి వేసినట్లు ప్రకటించే వరకు కూడా అధికారులం దరూ గమనిస్తూ ఉండాలన్నారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్నందున కౌటింగ్ కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని రిటర్నింగ్ అధికారులు ఆదేశించారు. కౌంటింగ్ నిర్వచనానికి అవసరమైన సిబ్బందిని కేటా యించాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ కు నియమించిన సిబ్బందికి త్వరలో శిక్షణ ఇస్తామని కలెక్టర్ చెప్పారు. మండు వేసవిలో కూడా ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించినందుకు ప్రతి ఒక్కరికికలెక్టర్ కతజ్ఞతలు తెలిపారు. జిల్లా అదనపు ఎస్‌పి సిహెచ్. సౌజన్య, కోవూరు రిటర్నింగ్ అధికారి సేదు మాధవన్, నగర నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వికాస్, కందుకూరు రిటర్నింగ్ అధికారి జి. విద్యాధరి, కావలి రిటర్నింగ్ అధికారి సీనా నాయక్, ఆత్మకూరు రిటర్నింగ్ అధికారి కే. మధులత, సర్వేపల్లి రిటర్నింగ్ అధికారి బి.చిన్న ఓబులేష్ ,ఉదయగిరి రిటర్నింగ్ అధికారి ప్రేమ్ కుమార్, నోడల్ ఆఫీసర్లు టీ.బాపిరెడ్డి ఎస్. రాజు, శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, పంపిణీ చేస్తున్న మందులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ . డి ఎం హెచ్ఒ డాక్టర్ ఖాదర్ వలి పేర్కొన్నారు. మంగళవారం కొండా యపాలెం అ బైండింగ్ హోప్ ట్రస్ట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లా డుతూ గత మూడేళ్ల నుంచి 200 మందికి న్యూట్రిషన్ ఫుడ్ అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ నిర్మల్ కుమార్ ను అభినందించారు. ప్రారం భంలో15 మందితో మొదలైన ఈ కార్యక్ర మం ప్రస్తుతం 200 మందికి చేరుతుందని ఒక్కొక్కరికి రూ .1500 లు ఖర్చుపెట్టటం గొప్ప విషయమని ఆయన ప్రశంసించారు. ప్రభుత్వం అన్ని కార్యక్రమాలు నిర్వహిం చలేదని దాతలు స్వచ్ఛంద సంస్థలు తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ట్రస్ట్ చైర్మన్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేదలు బడుగు బలహీన వర్గాల వారికి అన్ని రకాల సహాయ సహకారం అందిస్తున్నామన్నారు. ఫాదర్ రోసారయో ఎ. జయప్రకాష్. ఫాదర్ లివింగ్టన్. రూట్ బినోమి. మరియమ్మ. శశి .దేవకప. విలియమ్స్ .క్రాంతి .హేమంత్ జయ పాల్గొన్నారు.



రేవ్ పార్టీ వెనుక మంత్రి 'కాకాణి'

అంతర్రాష్ట్ర మాఫియాతో ఆయనకు సన్నిహిత సంబంధాలు - మాజీ మంత్రి సోమిరెడ్డి ఆరోపణలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

బెంగుళూరులో జరిగిన రేవ్ పార్టీ వెనుక మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాఫియా హస్తం ఉందని, అంతరాష్ట్ర మాఫియాతో మంత్రికి సన్నిహిత సంబంధాలున్నాయని మాజీ మంత్రి. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంత మంది ఎమ్మెల్యేలుండగా కాకాణి స్టిక్కర్ తో ఉన్న కారు, ఆయన పాస్ పోర్టే రేవ్ పార్టీలో ఎందుకు దొరికాయని ప్రశ్నించారు. తప్పుచేసిన ప్రతి సారీ బుకాయించడం కాకాణికి అలవాటుగా మారిందన్నారు. సంఘవిద్రోహ శక్తులతో చేతులు కలిపిన కాకాణిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కనుసన్నల్లోనే బెంగుళూరు శివారులో రేవ్ పార్టీ జరిగిందని తెలిపారు. గోవర్ధన్ రెడ్డి మాఫియా గ్యాంగే రేవ్ పార్టీకి అన్ని ఏర్పాట్లు చేసిందని తేలిందన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి స్టిక్కర్ ఉన్న కారుతో పాటు ఆయన పాస్ పోర్టు, కొకైన్ తదితర డ్రగ్స్ రేవ్ పార్టీ ప్రదేశంలో ఎందుకు దొరికాయో సమాధానం చెప్పాలన్నారు. పార్టీ జరిగిన ఫామ్ హౌస్ యజమాని గోపాల్ రెడ్డి కాకాణికి అత్యంత ఆప్త మిత్రుడు అని తెలిపారు. కల్తీ మద్యం పంచి ఏడుగురు అమాయకుల చావుకు కారణమైనప్పుడు కూడా కోర్టుకు పోయి బెయిల్ తెచ్చుకున్నారన్నారు. నకిలీ పత్రాల కేసులోనూ సుప్రీం కోర్టుకు పోయి బెయిల్ తెచ్చుకున్నారన్నారు. ఏ రోజూ తాను నేరం చేశానని ఒప్పుకోలేదన్నారు. నడిరోడ్డుపై పబ్లిక్‌గా మర్డర్ చేసిన హంతకుడు కూడా తానే చేశానని ఒప్పుకోరన్నారు. మంత్రి కాకాణి గత చరిత్ర చూసుకుంటే అంతర్రాష్ట్ర మాఫియాతో ఆయనకు ఉన్న సంబంధాలు స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. 2014 ఎన్నికల సందర్భంగా కల్తీ మద్యం పంచి ఏడుగురి ప్రాణాలు బలితీసుకున్న ఘటనలో కాకాణి సహా ముద్దాయిలు బెంగుళూరుకు చెందిన డ్రగ్ మాఫియా, ఎర్రచందనం, లిక్కర్ మాఫియాల్లో కీలకమైన వారన్నారు. కల్తీ మద్యం కేసులో కాకాణి స్నేహితులైన రాజేంద్ర నిర్మల్ కుమార్, ఎస్ఎన్ సంతోష్, కార్గో లోకేష్, కార్గో రమేష్ నలుగురూ బెంగుళూరు వారేనని, ఇంటర్నేషనల్ స్మగ్లర్ అప్పా ఇదే కేసులో రాజమండ్రి జైలులో ఉంటూ ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. సింగపూరులో నకిలీ పాస్‌పోర్టుతో దొరికిపోయిన వ్యక్తి కాకాణికి నకిలీ డాక్యుమెంట్ల కేసులో సహ నిందితుడని చెప్పారు. కర్ణాటకలో 224 మంది, ఆంధ్రాలో 175 మంది, తెలంగాణలో 119 మంది కలిపి 518 మంది ఎమ్మెల్యేలున్నారు. వారిలో ఒక్కొక్కరికి మూడు, నాలుగు ఎమ్మెల్యే స్టికర్స్ ఉంటాయని, మూడు రాష్ట్రాల్లోని ఏ ఒక్క ఎమ్మెల్యే కారు రేవ్ పార్టీలో దొరకలేదన్నారు. ఏ ఎమ్మెల్యే స్టిక్కర్ చిక్కలేదని, ఒక్క కాకాణి గోవర్ధన్ రెడ్డి స్టిక్కర్‌తో ఉన్న కారు మాత్రమే దొరికిందన్నారు. ప్రస్తుత కర్ణాటక ప్రభుత్వం, ఏపీలో రాబోతున్న టీడీపీ కూటమి ప్రభుత్వం, కేంద్రంలో రాబోతున్న ఎన్డీఏ ప్రభుత్వం...సంఘ విద్రోహ శక్తులుగా మారిన ఈ అంతర్రాష్ట్ర గ్యాంగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుకుంటున్నానన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి నడిపిన ల్యాండ్ మాఫియా, మైనింగ్, లిక్కర్, ఫేక్ డాక్యుమెంట్స్ ఇప్పుడు డ్రగ్ మాఫియాలకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని తాను ప్రభుత్వాలకు సమర్పించబోతున్నానని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి 'సోమిరెడ్డి'




వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి

'మొబైల్ హంట్ అప్లికేషన్ సేవలు భేష్

ప్రజాశక్తి-నెల్లూరు : మొబైల్ హంట్ అప్లికేషన్ సేవలు మంచిగా ఉన్నాయని ఎస్‌పి కె.ఆరీఫ్ హాఫీజ్ అన్నారు. మంగళవారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో రకరకాల కారణాలతో మొబైల్స్ పోగొట్టుకున్న, సెల్ ఫోన్లు చోరీకి గురైన బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు మొబైల్ హంట్ అప్లికేషన్ ద్వారా గుర్తించబడ్డ 600 సెల్ ఫోన్లను యజమానులకు అందజేశారు. కోటి యాభై లక్షల విలువ చేసే ఈ ఫోన్లను సెల్‌ఫోన్ పోగొట్టుకున్న యజమానులు పోలీసులకు ఆధారాలు చూపించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో మొబైల్ హంట్ అప్లికేషన్ ద్వారా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు ఫిర్యాదు చేసిన 2320 మందికి మొబైల్ ఫోన్లను అందజేశామన్నారు. ఇప్పటికే ఆరు విడతల్లో సుమారుగా రూ.5.85 కోట్ల విలువ సెల్‌ఫోన్లు అందజేశామన్నారు. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సుమారు రూ.7.5 లక్షల విలువ చేసే 36 మొబైల్‌ను బాధితులకు అందజేశామన్నారు. ఎంతో విలువ కలిగిన సెల్‌ఫోన్లు పోగొట్టుకొని , తిరిగి వాటిని పోలీసులు అందజేస్తున్న సమయంలో బాధితుల ఆనందానికి అడ్డు లేకుండా పోయింది. ఈ సమయంలో బాధితులు థ్యాంకు ఎస్‌పి సార్ అంటూ కృతజ్ఞతలు తెలిపారు.

జిజిహెచ్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు : దక్షణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం సర్వజన ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ,కార్మిక,కర్షక వర్గాలకు అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి ఎనలేని పోరాటాలు చేసిన పుచ్చలపల్లి సుందరయ్య 39 వ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా ఉద్యోగులు ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. వేసవికాలం లో రక్తం కొరత ఉంటుందని, అంతే కాకుండా కాన్పుల సమయంలో రక్తం అవసరం ఉంటుందని, ఈ నేపథ్యంలో రక్తదానం శిబిరం నిర్వహించా మన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు నరమాల సతీష్ కుమార్, రాష్ట్ర ఉపా ధ్యక్షులు షేక్ సందానీ బాషా,సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్,అధ్యక్షులు కమ్మటి శ్రీనివాసులు, సహాయ ఆచార్యులు రాజీవ్‌రెడ్డి సాధారణ శస్త్రచికిత్స విభాగం,అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు బయోకెమిస్ట్రీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం నాయకులు

వైద్య సిబ్బందిపై దాడులు అమానుషం

నెల్లూరు : శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలం సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందిపై దాడులు చేస్తూ వైద్యసిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమైన చర్య, అమానుషమని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ పేర్కొంది. మంగళవారం నగరంలో హంస జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు చేజర్ల సుధాకం రావు, బి.కమల్ కిరణ్‌లు మాట్లాడుతూ అత్యవసర వైద్య సేవలు అందించే వైద్యాధి కారులు వైద్య సిబ్బందిపై ఇష్టారాజ్యంగా వ్యవహరించి కొట్టడం, హాస్పిటల్ ఫర్నిచర్, రికార్డులు ధ్వంసం చేయడం బాధాకరం, శోచనీయమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. హంస జిల్లా నాయకులు మజారర్లా పరిమళ, జలీల్ అహ్మద్ కోవూరు తాలూకా నాయ కులు బెనర్జీ, ఆసియా బేగం వేణు, , సుమతి, ఉమా వర కుమార్ పాల్గొన్నారు.



అల్లర్లకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-సీతారామపురం

ఎన్నికల సందర్భంగా గ్రామాలలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఉదయగిరి సిఐ వి.గిరిబాబు ప్రజలకు వివరించారు. మంగళవారం సీతారామపురం మండలంలోని సింగారెడ్డిపల్లి గ్రామంలో పోలీసు బందోబస్తుతో కవాతు నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. గతంలో పోలింగ్ రోజున సింగారెడ్డి పల్లెలో పలు ఘర్షణలు జరిగిన నేపథ్యంలో మరోసారి ఎటువంటి అల్లర్లు జరగకుండా తీసుకునే చర్యలలో భాగంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మండలంలో చేదురు ముదురు ఘటనలు మినహా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల సమయంలో ఘర్షణలు జరిగిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసినా కూడా ప్రశాంత వాతావరణం వచ్చే వరకూ ప్రజలు ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత ఆవేశాలకు లోనై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ప్రజలందరూ సంయమనంతో ఎన్నికలను చూడాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ తదుపరి పరిణామాలను దృష్టిలో ఉంచుకొని వ్యక్తిగత గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట సీతారామపురం, ఉదయగిరి ఎస్ఐలు పత్తిపాటి అనూష, ఇంద్రసేనారెడ్డి సిబ్బంది ఉన్నారు.



మేకపాటిని కలిసిన 'కల్లూరి' బృందం

ప్రజాశక్తి-ఉదయగిరి

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డిని శకునాలపల్లి సర్పంచుల సంఘ అధ్యక్షులు కల్లూరి వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య నేతల బృందం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డిని బెంగళూరులోని ఆయన నివాసంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కల్లూరి వెంకటేశ్వర్లు రెడ్డి ముఖ్య నేతలైన పెద్దిరెడ్డి వెంగల్ రెడ్డి, యువ నాయకులు కల్లూరి కరుణాకర్ రెడ్డిలతో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉదయగిరి మండలంలో జరిగిన ఎన్నికల సరళిని మేకపాటికి వారు వివరించి ఎన్నికల్లో మేకపాటిదే ఘన విజయం ఖాయమని ఉదయగిరి కొండపై చరిత్రను తిరగరాసే విధంగా వైసిపి జెండా ఎగరబోతుందని ఆశాభవం వ్యక్తం చేశారు. ముందుగా మేకపాటి రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి 4వ తేదీ వచ్చే ఫలితాలలో వైసిపి విజయ ఢంకా మోగిస్తుందని ఆయనకు కల్లూరి వెంకటేశ్వర రెడ్డి తన బృందం అభినందనలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సీతారామపురం

ఉదయగిరి నుండి సీతారామపురం వరకు ఉన్న 33 కెవి ఫీడరు లైన్ మరమ్మతులు కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ ఎఇ శ్రీహరి తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

పండ్లల్లో రారాజు 'మామిడి'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



నిత్యం మార్కెట్లలో ఎన్నో రకాలు పండ్లు దొరుకుతుంటాయి. కానీ సీజన్లలో దొరికే పండ్లలో మామిడి ప్రత్యేకమైనది. ఇవి వేసవి కాలంలోనే ఎక్కువగా లభ్యమవుతాయి. ఈ పండ్లను చూడగానే ప్రతి ఒక్కరికీ నోరూరుతాయి. అందుకే వీటిని పండ్లల్లో రారాజుగా పిలుస్తారు. ఈ పండు తియ్యగా పుల్ల పుల్లగా అంటూ కమ్మనైన రుచిని అందిస్తుంది. ప్రపంచం వ్యాప్తంగా 400 రకాలు మామిడి ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. అయితే ఇప్పుడు మామిడి సీజన్ కాలంతో మార్కెట్లలో మామిడి సందడి చేస్తుంది. ఈ సీజన్లో ఆశించనంత మామిడి దిగబడులో లేకపోవడంతో కిలో రూ.100 నుంచి రూ.120 ధర పలుకుతుంది. అయితే పక్వానికి రాని మామిడి పండ్లను కార్బైట్‌తో మగ్గబెట్టడం వలన దుష్పరిణామాలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని రైతులు సూచిస్తున్నారు. కార్బన్ వాడటం వల్ల పండ్లు రంగు ఆకర్షణీయంగా కనపడుతూ తద్వారా వినియోగదారులు విపరీతంగా కొనుగోలు చేస్తున్నారు. కృత్రిమంగా మగ్గబెడుతున్న పండ్లు విక్రయాలను నిరోధించేందుకు అధికార యంత్రాంగం లేకపోవడం ఆరోగ్యశాఖ అధికారులు సక్రమంగా పనిచేయకపోవడంతో కార్బైడ్ వినియోగం ఇష్టారాజ్యంగా మారుతుంది. కొంతమంది అక్రమ తెర లేపుతూ కార్బైడ్‌తో పండ్లు మగ్గపెట్టి చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. చెట్ల నుండి కోసిన లేత మామిడికాయలను కార్బన్‌తో మగ్గ పెట్టడం వల్ల రుచిని కోల్పోతూ తొందరగా పండుతున్నాయి.

కార్బైడ్ నిషేధం.. కాగితాలకే పరిమితం..

కార్బైట్‌తో మగ్గబెట్టిన పండ్లను తిని వినియోగదారులు వ్యాధుల బారిన పడడంతో ప్రభుత్వం 2012 మార్చి 19న కార్బైడ్ వాడకాన్ని నిషేధించి. ఈ మేరకు జిఒ నెంబర్ 288 జారీ చేసింది. ఈ జిఒను అమలు చేయడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోవడంతో నిషేధం కాగితాలకే పరిమితమైంది. రైతులకు వ్యాపారులకు కార్బైట్ వల్ల కలిగే అనర్థాలు వివరించి ప్రత్యామ్నాయ పద్ధతులపై అవగాహన కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-కావలి రూరల్



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పెండింగ్‌లో ఉన్న రెండు నెలల హెల్త్ అలవెన్సులతో పాటు సమ్మెకాలం జీతం, పండుగ బోనస్, ఇవ్వాలని కోరుతూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఆ సంఘం గౌరవ అధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో వందలాది మంది పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు పనులు చేస్తున్నారని కార్మికులకు ప్రభుత్వం నుండి రావాల్సిన రెండు నెలల హెల్త్ అలవెన్సలు, సంక్రాంత్రి పండుగ బోనస్, సమ్మె కాలం 16 రోజుల జీతం, కార్మికులకు రావాల్సి ఉందని సమ్మె జరిగి సుమారు ఐదు నెలలు అయినప్పటికీ సమ్మె కాలం జీతం పండుగ బోనస్ రూ.1000 రెండు నెలల హెల్త్ అలవెన్సులు కార్మికులకు ఇంతవరకు రాలేదని దానివల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతినెలా జీతం వస్తేనే కుటుంబాలు గడవడం అంతంత మాత్రంగా ఉండే ఈ రోజుల్లో ఇప్పటివరకు కార్మికులకు పెండింగ్ బకాయిలు రాకపోవడం అన్యాయమన్నారు. తఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి పెండింగ్లో ఉన్న హెల్త్ అలవెన్సులు సమ్మె కాలం జీతం పండుగ బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.అఖిలేష్, టి.శ్రీనివాసులు, ఒ.రమేష్, బి.మహేష్, బాబు, పి.చిన్నమ్మ, ఎస్.మనేమ్మ, పి.అనిత కార్మికులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు
విఘాతం కలిగిస్తే కేసులు

ప్రజాశక్తి-బిట్రగుంట



మాట్లాడుతున్న ఎస్‌పి ఆరిఫ్ హాఫీజ్

ఎన్నికల ఫలితాల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు తప్పవని జిల్లా ఎస్‌పి ఆరిఫ్ హాఫీజ్ పేర్కొన్నారు. కావలి రూరల్ పరిధిలోని జువ్వలదిన్నెలో తీర ప్రాంత మత్స్యకార గ్రామాలలోని గ్రామకాపులు, గ్రామస్తులు, గ్రామ పెద్దలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలింగ్ వరకు ఎటువంటి వివాదాలు లేకుండా అల్లర్లకు, గొడవల జోలికెళ్లవద్దు అని వివాదాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. జిల్లా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ఎటువంటి విద్వేషాలకు గురి కావొద్దు అని, సంయమనంతో వ్యవహరించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సత్ప్రవర్తనతో మెలగకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసుల్లో ఇరుక్కుపోయి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆ ప్రభావం కుటుంబ సభ్యులపై పడుతుందన్నారు. కార్యక్రమంలో కావలి డిఎస్‌పి వెంకటరమణ, కావలి రూరల్ సిఐ నాగభూషణం, కావలి రూరల్ ఎస్‌హెచ్ఒ, కావలి వన్ టౌన్ సిఐ, బిట్రగుంట పోలీస్ సిబ్బంది, పోలీస్ అధికారులు, మత్స్యకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల సామగ్రిని సిబ్బంది తీసుకొని వెళ్లే కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో ఈసీ నిబంధనల మేరకు సిబ్బందికి సదుపాయాలు కల్పించుకోవడంపై ముగ్గురు రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం అందిన సమాచారం మేరకు ఆత్మకూరు ఆర్‌డిఒ కె.మధులత తహశీల్దార్ శివనాగిరెడ్డి ఆర్ఐ పృథ్వీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమంలో సిబ్బందికి తాగునీరు భోజన వసతి విషయంలో అవకతవకలు జరిగాయని, సరిపడినంత భోజనం తాగునీరు అందలేదని, ఆరోజు సిబ్బంది నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ స్వయంగా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదుపాయాలు ఏర్పాటు విషయంలో ఎన్నికల అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించారని నిర్ధారించుకున్నారు. దాంతో ఆ ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.



మాట్లాడుతున్న ఎపిఒ వెంకటనారాయణ

'ఉపాధి' పనులు పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని ఖాదార్‌పూర్‌లో జరుగుతుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎపిఒ వెంకటనారాయణ సోమవారం తనిఖీ చేశారు. ఆయన కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేసి ప్రభుత్వం ప్రకటించిన దినసరి కూలీ రూ.300 పొందాలని సూచించారు. ఉపాధి హామీ కూలీల పనిదినాలు తదితర పనులను గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా ఎండలు అధికంగా ఉన్నందున ఉదయం పూట సకాలంలో పనులు పూర్తి చేసుకోవాలన్నారు. పని జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు అన్ని వసతులతో పాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలో ఉపాధి హామీ జాబ్ కార్డులు కలిగిన వారందరూ ఉపాధి పనులకు రావాలని ఆయన కోరారు. ఆయనవెంట ఫీల్డ్ అసిస్టెంట్ గంగిరెడ్డి తదితరులు ఉన్నారు.

బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి

- దళిత సంఘర్షణ సమితి

ప్రజాశక్తి-కావలి



నినాదాలు చేస్తున్న సమితి నాయకులు

దళిత, గిరిజన అత్యాచార బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని, కలెక్టర్ స్పందించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. మంగళవారం కావలి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ జిల్లాలో 2023-24కు సంబంధించి సంవత్సరం నుండి అత్యాచారాలకు గురైన దళిత గిరిజన మహిళలకు, బాలికలకు ఎస్‌సి, ఎస్‌టి చట్టం ద్వారా వచ్చే బాధితులకు నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. ఎన్నిసార్లు జిల్లా కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చినా ఖజానాలో డబ్బులు లేవని, సమాధానం చెపుతున్నారన్నారు. బాధితులు 42కేసుల్లో రూ.18లక్షల వరకు నష్ట పరిహారం ఇవ్వాలని ఛార్జిషీట్‌లు దాఖలు చేసి కలెక్టర్‌కు పెట్టి ఉన్నారని తెలిపారు. అయినా అధికారులు స్పందించ లేదన్నారు. బాధితులు కోర్టుల చుట్టు తిరగడానికి నయాపైసా లేకుండా బాధపడుతున్నారని తెలిపారు. అత్యాచారాలకు గురి కావడం నష్టపరిహారం అందక మనోవేదనకు గురవుతున్నా జగనన్న ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంద న్నారు. బాధితులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ నుండి 16వేల కోట్ల రూపాయిలు అప్పు తెచ్చారని తెలిపారు. 10వేల కోట్ల రూపాయిలు కేవలం కాంట్రాక్టర్లకు ఇచ్చారన్నారు. అత్యాచార బాధితులకు ఇచ్చేందుకు రూ.18లక్షలు లేకపోవడం దారుణమైన విషయమన్నారు. కలెక్టర్ అయినా స్పందించి బాధిత మహిళలకు, బాలికలకు నష్టపరిహారం కింద 42కేసుల వారికి పరిహారం ఇవ్వాలని తెలిపారు. ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన బాధితులు అనేక బాధలకు గురవుతున్నారన్నారు. నిరాశ నిస్పృహలతో సంవత్సరం నుండి నష్ట పరిహారం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇవ్వాలని తెలిపారు. దేవరకొండ హజరత్తయ్య, మందా వెంకటేశ్వర్లు, ముక్కు మోహన్‌రావు, చౌటూరి లక్ష్మయ్య, జెడ్డా వాసు, జరుగుమల్లి విజయరత్నం పాల్గొన్నారు.



రహదారి మూతతో గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-కోవూరు

మండల పరిధిలోని పెద్దపడుగుపాడు గ్రామం వద్ద రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్న నేపథ్యంలో నూతన రహదారి నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతుండగా గ్రామానికి చెందినటువంటి ప్రధాన దారిని మూసేస్తున్నారని తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకొచ్చి తమ గ్రామానికి మార్గాన్ని అలాగే ఉంచాలంటూ ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఐదు కిలోమీటర్ల మేరకు వాహనాలు భారీగా నిలిచిపోవడంతో . రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ మేరకు గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వారికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పలు గ్రామాలకు చెందిన రైతులు 832 పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా వీటిలో 796పొగాకు బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్థులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 18పొగాకు బేళ్లను తిరస్కరించామన్నారు. వీటిలో ఎన్ఎస్ 04ఎన్ బి05సిఆర్ 08ఉన్నాయని, అధిక బరువుతో ఉన్న 18 పొగాకు బేళ్లను వేళానికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.320 కాగా కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.279.03 నమోదు కాగా, వేలంలో 18మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.

1న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సీతారామపురం

స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జూన్ 1వ తేదీన మండల పరిషత్ అధ్యక్షురాలి ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నామని ఎంపిడిఒ అబ్దుల్ కలామ్ఆజాద్ తెలిపారు. ఈ సమావేశానికి జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో తాగునీటి సరఫరా, విద్యా శాఖ, వ్యవసాయ శాఖ, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, గృహనిర్మాణశాఖ, పలు ఇతర సమస్యల పై సమీక్షను నిర్వహించడం జరుగుతుందన్నారు.

అసత్యాలు మానుకోవాలి

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న జనసేన నాయకులు

కావలి నియోజకవర్గం జనసేన నేతగా పార్టీ బలోపేతానికై అళహరి సుధాకర్ చేస్తున్న కృషిని చూసి ఓర్వలేని కొందరు తమ పార్టీలోని వ్యక్తులే, జనసేన కావలి నియోజకవర్గం ఇంచార్జ్ అళహరి సుధాకర్‌పై దుర్మార్గపు వ్యాఖ్యలకు ఆరోపణలకు పాల్పడడం హేయమైన చర్య అని కావలి నియోజకవర్గ జనసేన నేతలు మండిపడ్డారు. కావలి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించిన వారు, సోమవారం రోజున "జనసేన నేతలు" అన్న పేరుతో కొందరు నాయకులు ఎవరో పోసిన టానిక్ తాగి, విలేకరుల సమావేశం నిర్వహించి, అళహరి సుధాకర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, తమ అళహరి సుధాకర్ వారిలాగా దిగజారే వారు కాదన్నారు. నియోజకవర్గం అంటే కావలి టౌన్ వరకే పరిమితం కాదని, నాలుగు మండలాలు కూడా బలోపేతం చేసిన వ్యక్తి అని, ఆధారాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా అళహరి సుధాకర్‌తో కలసి పనిచేసిన నేతలు నేడు ఎన్నికల సమయంలో కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అళహరి సుధాకర్‌ను తొలగించాలని వ్యాఖ్యలు చేయడం వారి స్వార్థపూరిత రాజకీయాలకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. జనసేన కావలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ ఆయన వర్గం నేతలు వైసిపికి వత్తాసు పలికారంటూ తమపై బురద చల్లేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. వాస్తవ పరిస్థితులలో వైసిపి నుండి అళహరి సుధాకర్‌కు ముడుపులు అందినట్లు నిరూపించగలరా అంటూ ప్రశ్నించారు. కావలి నియోజకవర్గంలో ఓటు కూడా లేని నేతగా అళహరి సుధాకర్‌ను పేర్కొనడం వారి అవివేకానికి అద్దం పడుతుందని, అళహరి సుధాకర్ కావలి పట్టణంలో ఓటు వేశారని గుర్తు చేశారు. ఇకనైనా దుర్మార్గపూరిత యోచనలతో దుష్ప్రచారాలకు దిగడం మానుకోకుంటే రానున్న రోజులలో సరైన రీతిలో బుద్ధి చెప్తామని చట్టపరంగా చర్యలను చేపట్టేందుకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు టౌన్ కమిటీ మెంబర్ మస్తాన్, కూర్డినేటర్ సుధీర్, రూరల్ మండల అధ్యక్షుడు వెంకయ్య, అల్లూరు మండల ఉపాధ్యక్షుడు పడకల నాని, దగదర్తి మందల అధ్యక్షుడు వెంకట్ యాదవ్, బోగోలు మండల అధ్యక్షుడు వెంకటేష్ తిరుమలశెట్టి, యూత్ కోఆర్డినేటర్ చంటి, ఐ.టి.ఇంచార్జి బాలు, రూరల్ నాయకులు బాలు, అగస్టిన్, రాజేష్, బాబు వీర మహిళలు లక్ష్మి, సాహితీ, హెలెన్, లిఖిత, తదితర నాయకులు పాల్గొన్నారు.



అమలులో 30పోలీస్ యాక్ట్

ప్రజాశక్తి-కావలి

కావలి సబ్ డివిజన్ పోలీస్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నట్లు కావలి డిఎస్‌పి ఎం.వెంకట రమణ తెలిపారు. రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని కావలి డివిజన్ పరిధిలో అమలులో ఉన్న 30 పోలీస్ యాక్ట్, ప్రకారం ప్రజలు, రాజకీయ పార్టీలు, ఇతర ఏ సంఘాలు ముందస్తు అనుమతి లేనిదే ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పై చర్యలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



నిర్మానుష్యంగా మారిన రోడ్డు

భానుడి భగ భగలు

ప్రజాశక్తి ఇందుకూరుపేట

భానుడి భగభగలతో ఇందుకూరుపేట మండలం నిప్పుల కొలిమిలా మారింది. మంగళవారం పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు ఏకంగా 44 డిగ్రీలు దాటాయి. ఎండ వేడిమి, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో మైపాడు, ఇందుకూరుపేట, గంగపట్నం, కోరుటూరు గ్రామాలలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఈ వేడిమితో ఒక్కసారిగా టూరిస్టులతో ఎంతో రద్దీగా ఉండే నెల్లూరు మైపాడు రహదారి మార్గం నిర్మానుష్యంగా మారింది. ఎండ వేడిమికి పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోజురోజుకు ఎండ తీవ్రత అంతకంతకూ పెరుగుతుండడంతో ఉదయం పూట ఎండ వేడిమి, రాత్రి సమయాల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవితో వ్యాపారస్తులు కూడా వ్యాపారాలు లేక నష్టాలపాలు అవుతున్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి



పనులు పరిశీలిస్తున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

మనబడి నాడు-నేడు పనులను మే చివరినాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఎంఇఒలు షేక్ మస్తాన్ వలీ, తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అప్పసముద్రం జిల్లా ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న అదనపు తరగతి గదులు నూతన టాయిలెట్స్ నిర్మాణాలు ఎలక్ట్రిఫికేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పాఠశాల కమిటీని మేస్త్రీలను సమన్వయపరుస్తూ, సకాలంలో బిల్లులు చెల్లిస్తూ పనులు పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులు టి.విజయకుమార్‌కు కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. పనులు పూర్తి అయిన బిల్లులను ఎప్పటికప్పుడు నగదు పుస్తకంలో నమోదు చేస్తూ బిల్లులను ఎస్టిఎంఎస్ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని తెలిపారు. అనంతరం అదనపు తరగతి గదుల నిర్మాణము లింటెల్ లెవెల్ వరకు పూర్తయిన వాటికి కాంక్రీట్ గోడలకు ప్రతిరోజు ఉదయం సాయంత్రం పూటలా నీటితో క్యూరింగ్ చేయాలని ప్రధానోపాధ్యాయులకు కమిటీ సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డ్

ప్రజాశక్తి-మర్రిపాడు



నిరుపయోగంగా మారిన డంపింగ్ యార్డ్

స్వచ్ఛ భారత్ స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా పారిశుధ్య పనుల నిర్వహణలో ప్రభుత్వం నూతన విధానాన్ని అమలు చేసింది. ఇంటింటా చెత్త సేకరణకు రిక్షాలను ఉపయోగిస్తున్నారు. ఒక్కో వాహనం వద్ద ఇద్దరు కార్మికులు పని చేస్తున్నారు. పారిశుధ్యం మెరుగు పరుస్తూ ప్రజల ఆరోగ్యం జీవన విధానం మెరుగు పరచడం ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించు లక్ష్యంతో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వ ఆశయాలు నీరుగారుతోంది. గ్రామ పంచాయతీల్లో ఇంటింటా చెత్తసేకరణ కార్యక్రమం చేపట్టి సంపద సృష్టించేందుకు కేంద్రాలు ఏర్పాటు చేసినా క్షేత్రస్థాయిలో ఆచరణ సాధ్యం కాలేదు. లక్షల రూపాయలు వెచ్చించి డంపింగ్ యార్డులు నెలకొల్పిన ప్రయోజనం లేకుండా పోయింది. చేత్తసేకరణ కోసం కొనుగోలు చేసిన రిక్షాలు కొన్ని ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగనాలలో దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల ఇంటింటా చెత్త సేకరణ అమలుకు నోచుకోవడం లేదు. తడి పొడి చెత్తను వేర్వేరుగా ఉంచడానికి ఇంటింటికీ రెండు చొప్పున బుట్టలు పంపిణీ చేసిన ప్రయోజనం చేకూరడంలేదు. కొన్ని పంచాయతీలలో చెత్త సేకరణ అమలవుతుంది. గ్రామ పంచాయతీలకు నిధులు లేమితో గ్రామాలలో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారు పనులు మానేశారు. దాంతో అక్కడక్కడ పారిశుధ్య సమస్య చెత్త నిల్వలు దర్శనమిస్తున్నాయి. సేకరించిన చెత్త నుంచి ఎరువును తయారు చేసి వ్యవసాయానికి, మొక్కలకు ఉపయోగించేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పొడి చెత్తను రీసైకిల్ చేసి అమ్ముకొని దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని పల్లెల అభివృద్ధికి ఉపయోగిస్తారు. పంచాయతీ అధికారులు దృష్టి సారించి ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ రిక్షాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.